ఎంత పని చేశావ్ బాబూ?

- ఒకటో తేదీన అందని పింఛన్
- ఉసూరుమన్న పండుటాకులు
- సచివాలయానికి ఎలా వెళ్లాలని దివ్యాంగుల వేదన

ఒకటో తారీఖు వచ్చేసింది.. ఎప్పటిమాదిరిగానే తెల్లవారుజామున వలంటీర్ల అలకిడి లేదు. ఇంటి తలుపు తట్టిన చప్పుడు వినిపించ లేదు. ఉదయం 9 గంటల వరకు పండుటాకుల నుంచి దివ్యాంగుల వరకు ఆశగా ఎదురు చూశారు. పింఛన్ సొమ్ము ఇంకా చేతిలో పెట్టలేదని ఆలోచనలో పడ్డారు. ఇంతలో ఆనోట ఈనోట తెలిసింది ఇక వలంటీర్ రారంట.. పింఛన్ కోసం సచివాలయానికి వెళ్లాలంట.. ఈ వయసులో ఎలా? అని మదనపడ్డారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీరు వ్యవస్థపై టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కుట్రపూరితంగా ఫిర్యాదు చేయడంతో సోమవారం ఎంతోమంది పింఛన్‌దారులు ఇబ్బందులు పడ్డారు. మరలా టీడీపీ పాలన నాటి కష్టాలు తెచ్చిపెట్టావా అంటూ శాపనార్థాలు పెడుతున్నారు. – సాక్షి నెట్‌వర్క్

వలంటీర్ల వల్ల ఎన్నో సేవలు అందేవి



ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్లు పంపిణీ జరిగేది. వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఎంతో మేలు చేశారు. ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్లు తెల్లవారికి ముందే ఇంటికి వచ్చి ఇచ్చేవారు. ఈ రోజు ఎన్నికల నేపథ్యంలో టీడీపీ నేతలు కోర్టుకెళ్లి వలంటీర్ల ద్వారా పింఛన్లు ఇవ్వకుండా చేశారు. పేదలకు న్యాయం చేసిన జగన్‌మోహన్‌రెడ్డికి ఆదరణ రాకుండా కుట్ర చేస్తున్నారు. కరోనా సమయంలో పేదలకు అన్ని రకాల సేవలు అందించిన ఘనత వలంటీర్లదే. వారు లేకపోవడం వల్ల పేదలకు ఎంతో నష్టం కలుగుతోంది. – నారాయణమూర్తి, గొలుగొండ

పింఛన్ కోసం ఎదురు చూపు



ప్రతి నెలా మాదిరిగా ఈ నెల పింఛన్ సొమ్ము ఒకటో తేదీన వస్తుందని ఎదురు చూశాను. వలంటీర్లతో పంపిణీ చేయొద్దని ఆంక్షలు పెట్టారని తెలిసింది. మరలా ఈ నెల పింఛన్ కోసం సచివాలయాల వద్దకు వెళ్లాలని పంచాయతీ సిబ్బంది చెబుతున్నారు. సీఎం జగన్ ఐదేళ్ల పాలనలో ఒకటో తేదీనే వలంటీర్ వచ్చి పింఛన్ సొమ్ము అందించేవాడు. నా అనారోగ్య సమస్యలకు మందులు కొనుగోలు చేసుకునేందుకు, నా అవసరాలకు ఈ మొత్తం ఉపయోగపడేది. ప్రస్తుతం సచివాలయం వద్దకు వెళ్లి తీసుకోవాలంటే ఇబ్బందిగా ఉంది. చంద్రబాబు నిర్వాకంతో పింఛన్ కష్టాలు చూడాల్సి వస్తోంది. – తామరపల్లి వరలక్ష్మి, చిరికివానిపాలెం గ్రామం, కె.కోటపాడు మండలం

ముసలోళ్ల ఇబ్బందులు



ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారే వలంటీర్ మా ఇంటికి వచ్చి వృద్ధాప్య పింఛన్ సొమ్ము చేతిలో పెట్టేవాడు. గతంలో మాదిరిగా మాకు ఇబ్బందులు ఉండేవి కాదు. ఇప్పుడు వలంటీర్లు పింఛన్లు అందించకుండా ఫిర్యాదు చేశారంట. మాలాంటి ముసలోళ్లను ఇబ్బందులకు గురి చేయడం దారుణం. అసలే బయట ఎండలు మండుతున్నాయి. కర్ర ఊత ఉంటే తప్పా అడుగు పెట్టలేని మాలాంటి వృద్ధులను ఇబ్బందికి గురి చేయడం సరికాదు. – వారాది నర్సమ్మ, వృద్ధురాలు, తెనుగుపూడి, దేవరాపల్లి మండలం

తెల్లవారే పింఛను అందుకోనేదాన్ని



నేను దివ్యాంగురాలిని, నాకు 2021 జూన్ నుంచి పింఛను అందిస్తున్నారు. నా పింఛను గ్రామ వలంటీరు ఇంటికి తీసుకొచ్చి ఇచ్చేది. ఇప్పుడు పింఛన్ల పంపిణీ నుంచి తప్పించడం వల్ల మాలాంటి దివ్యాంగులు సచివాలయానికి వెళ్లి తీసుకోవడం ఇబ్బందికరంగా ఉంది. గత ప్రభుత్వంలో పింఛను కోసం పక్షం రోజులపాటు పంచాయతీ కార్యాలయం చుట్టు తిరిగే వారు. ఇప్పుడు ఇంటికి పింఛన్ అందకుండా చేశారు. – కోట్యాడ కుమారి, దివ్యాంగ లబ్ధిదారు, కె.జె.పురం, మాడుగుల మండలం

పింఛన్ కష్టాలు వచ్చాయన్నమాట



జగన్‌బాబు సీఎం అయిన దగ్గర నుంచి ప్రతి నెలా 1న తెల్లవారే సరికి పింఛన్ డబ్బులు మా వలంటీర్ వెంకటేష్ మా కల్లాం దగ్గరకు వచ్చి ఇచ్చేవాడు. ఈ రోజు పొద్దుట నుంచి ఇప్పటి వరకు చూసినా పింఛన్ డబ్బు ఇవ్వలేదు. ఎందుకు ఇవ్వలేదని మా అబ్బాయితో ఆరా తీయిస్తే చంద్రబాబు కోర్టు కేసు పెట్టి వలంటీర్లను దూరం పెట్టించారంట. మళ్లీ పంచాయతీ ఆఫీసుకు వెళ్లాలన్నారంట. 90 ఏళ్ల వయసులో నేను ఎలా వెళ్లగలను. నా లాంటి ముసలోళ్లకు మళ్లీ కష్టాలు వచ్చాయన్నమాట. – పెంటకోట సింహాచలమ్మ, అర్జునగిరి, చీడికాడ మండలం

పంచాయతీకి నడిచి ఎలా వెళ్లాలి?



వలంటీర్లు లేకపోతే మాకు పింఛన్ ఎలా వస్తుంది? ఎవరు తెస్తారు. ఈ వయసులో ఎండలో పంచాయతీకి నడిచి వెళ్లడం సాధ్యం కాదు. ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే పింఛన్ తెచ్చి పోయేవోడు. బాగున్నావా అని పలకరించేవాడు. అలాంటి మా వలంటీర్ ఇప్పుడే కాదు కరోనా కాలంలో మాస్క్ తెచ్చి ఇచ్చాడు. అందరూ ముసలోళ్లమని దూరంగా ఉన్నా దగ్గరికి వచ్చి పింఛన్ ఇచ్చి మంచి చెడ్డలు తెలుసుకునేవాడు. అలాంటిది వాళ్లని తీసేత్తే ఎలాగవుతాది. వలంటీర్లు ఉండాలి, ఎప్పటి మాదిరిగా మాకు పింఛన్ ఇంటికే రావాలి – గొర్లె నూకాలమ్మ, రావికమతం

పింఛన్ కోసం వృద్ధుల ఎదురు చూపు



గ్రామ వీధిలో వృద్ధాప్య పింఛన్‌దారులు

రోలుగుంట: టీడీపీ నాయకుల కుట్రతో ఈ నెల ఒకటినే అందాల్సిన పింఛన్ సొమ్ము జాప్యం కావడంతో వృద్ధాప్య పింఛన్‌దారులు ఉసూరుమంటున్నారు. జగన్‌బాబుకు మంచిపేరు వస్తుందని అక్కసుతో ఎన్నికల కోడ్ అడ్డం పెట్టుకుని టీడీపీ నాయకులు కుట్రలు చేస్తున్నారని రోలుగుంటకు చెందిన చింతల బాబూరావు వాపోయాడు. ఇతనితోపాటు ఇక్కడ పింఛన్ కోసం చూస్తున్న వృద్ధులు మద్దు రాజుబాబు, దనిమిరెడ్డి నూకరాజు, గొర్లె ఎర్రినాయుడు వారి ఇబ్బందులు చెప్పుకున్నారు. పింఛన్ వస్తాదన్న ధీమాతో టిఫిన్ బిల్లు, కిరాణా అప్పు ప్రతి నెలా ఒకటినే తీర్చేవాళ్లమని, ఇప్పుడు ఏమి చేయాలో తోచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల పునరుద్ధరణ

మాకవరపాలెం: స్థానిక పీహెచ్‌సీలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లను పునరుద్ధరిస్తామని వైద్యాధికారి సీతారామలక్ష్మి తెలిపారు. కోవిడ్ కారణంగా మూడేళ్లుగా ఇక్కడ కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిలిపివేశారు. దీంతో మహిళలు కోటవురట్ల సీహెచ్‌సీ లేదా నర్సీపట్నంలోని ఏరియా ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలో ఈ నెల 4 నుంచి మరలా పీహెచ్‌సీలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆమె సోమవారం తెలిపారు.

క్లుప్తంగా

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

రోలుగుంట: కొండపాలెం గ్రామానికి చెందిన రెండు కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. టీడీపీకి చెందిన ముఖ్య కార్యకర్తలు పాము చిరంజీవి, నూకరాజులకు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మాజీ సర్పంచ్ బంటు సూర్యసన్యాసి దేముళ్లతో కలసి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమాల అమలు, ధర్మశ్రీ నాయకత్వంపై ఆకర్షితులమై పార్టీలో చేరామన్నారు. పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పని చేస్తామని తెలిపారు.

ఎంసెట్ ఉచిత కోచింగ్

నర్సీపట్నం: స్థానిక ఎస్ఎఎన్, అరుణా చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఎంసెట్ ఉచిత కోచింగ్ ఇస్తున్నామని ఎస్ఎఎన్ ఒకేషనల్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ సూరెడ్డి ఉమా మహేశ్వరి తెలిపారు. ఈ నెల 3వ తేదీ నుంచి ఉచిత కోచింగ్ తరగతులు ప్రారంభిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

4న మండల సర్వసభ్య సమావేశం

రోలుగుంట: ఈ నెల 4న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఈవోపీఆర్డీ ఎస్.నూకరాజు తెలిపారు. ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్న ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ఆహ్వానితులు విధిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పోతనపూడి అగ్రహారంలో విగ్రహ ప్రతిష్ట



ఆలయం పై భాగంలో పసిడికుండ ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్: పోతనపూడి అగ్రహారంలో నూతన పైడితల్లమ్మ ఆలయ ప్రారంభోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. గత నెల 30వ తేదీ నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా మూడో రోజు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాది కార్యక్రమాలు, ఆలయంపైన పసిడికుండ కలశ ప్రతిష్ట నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ ధర్మకర్తలు వేపాడ రాజు, మడగల వెంకటరమణ, ఆలయ స్థల దాత శ్రీనాథు రమేష్, సర్పంచ్ కోరుకొండ భవానీ, వీరవల్లి అగ్రహారం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోరుకొండ చెల్లంనాయుడు, స్థానికులు కోరుకొండ సాంబమూర్తి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ



రోలుగుంటలో వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

రోలుగుంట: ఎన్నికల కోడ్ నేపథ్యంలో రూ.50 వేలు మించి నగదుతో తనిఖీలో పట్టుబడితో సీజ్ చేస్తామని రావికమతం, రోలుగుంట మండలాల ఫ్లయింగు స్క్వాడ్ అధికారి ఎం.నాగమోహన్‌రావు హెచ్చరించారు. సోమవారం ఆయన వడ్డాది–నర్సీపట్నం ఆర్ అండ్‌బీ రోడ్డులో తన సిబ్బందితో కలసి వాహనాలను తనిఖీలు చేశారు. ఏ విధమైన అనుమతి లేని రాజకీయ జెండాలు కాని, ప్రచార సామగ్రి గాని తరలిస్తే కేసులు, వాహనాలు సీజ్ తప్పదన్నారు.

పింఛన్ల పంపిణీలో రాజకీయాలు దుర్మార్గం



కార్యకర్తల సమావేశంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

- ఏ ఒక్కా సంక్షేమ పథకాన్ని సక్రమంగా అమలు చేశారా?
- చంద్రబాబుపై డిప్యూటీ సీఎం బూడి, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ ఆగ్రహం


బుచ్చెయ్యపేట: వృద్ధులకు, దివ్యాంగులతోపాటు ఇతర లబ్ధిదారులకు ఒకటో తేదీనే వలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ కాకుండా ఎన్నికల అధికారులకు టీడీపీ నాయకులు ఫిర్యాదు చేసి అడ్డుకోవడంపై వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం చిన అప్పనపాలెంలో పార్టీ శ్రేణుల మండల విస్తృత స్థాయి సమావేశంలో వీరు మాట్లాడారు. గత తెలుగుదేశం పార్టీ హయాంలో, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనలో ప్రతి కుటుంబానికి ఎంతమేర సంక్షేమ లబ్ధి కలిగిందో గుర్తించాలని ప్రజలను కోరారు. చంద్రబాబునాయుడు 14 ఏళ్ల పాలనలో పేదల కోసం ఒక్క సంక్షేమ పథకమైనా సక్రమంగా అమలు చేశారా అని ప్రశ్నించారు. రైతు, డ్వాక్రా రుణాలు మాఫీ చేయకుండా, ఇంటికొక ఉద్యోగం, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా మోసం చేసిన రోజులు ప్రజలు మర్చిపోలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలతోపాటు నవరత్నాలు కలిపి 99 శాతం నెరవేర్చి దేశంలోనే ఉత్తమ ముఖ్యమంత్రిగా పేరుగాంచారన్నారు. ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకుని స్థానికుడినైన తనతో పాటు ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీని అఖండ మెజార్టీతో గెలిపించి, జగనన్నకు బహుమతిగా ఇవ్వాలని ముత్యాలనాయుడు కోరారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కార్యకర్తలంతా సమష్టిగా పనిచేసి రెండోసారి అధికారంలోకి వచ్చేలా ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని విప్ ధర్మశ్రీ కోరారు. బుచ్చెయ్యపేట, చోడవరం జెడ్పీటీసీలు దొండా రాంబాబు, శ్రీకాంత్, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, జిల్లా కార్యదర్శి జోగా కొండబాబు, వైస్ ఎంపీపీలు గొంపా చినబాబు, డి. లలితానారాయణమూర్తి, స్టీరింగ్ కమిటీ మండలాధ్యక్షుడు నమ్మి అప్పలరాజు, నాయకులు సాయం రమేష్, కోవెల ఈశ్వరరావు, మరిసా నాని, సుంకరి శ్రీను, ముచ్చకర్ల అప్పారావు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత శిక్షణ

మాకవరపాలెం: దివ్యాంగులకు ఉచితంగా కంప్యూటర్ కోర్సు శిక్షణ ఇస్తామని మ్యుచువల్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ సతీష్ సోమవారం తెలిపారు. ఈ నెల 15 నుంచి మే 15వ తేదీ వరకు దివ్యాంగులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. తెలుగు, ఇంగ్లిష్ టైపింగ్, ఎమ్మెస్ ఆఫీస్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. దరఖాస్తులను ఆధార్, సదరం ధ్రువీకరణ పత్రంతోపాటు నాలుగు ఫొటోలతో అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 9951938520 సంప్రదించాలన్నారు.985436

సీడీసీ చైర్మన్ శ్రీను భార్యకు కన్నీటి వీడ్కోలు

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, మాడుగుల అసెంబ్లీ అభ్యర్థి అనూరాధ నివాళి



సుంకర శ్రీనును పరామర్శిస్తున్న విప్ ధర్మశ్రీ

చీడికాడ: గుండెపోటుతో మృతి చెందిన చోడవరం సుగర్స్ సి.డి.సి చైర్మన్ సుంకర శ్రీనివాసరావు భార్య జ్యోతి అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య సోమవారం ఖండివరంలో నిర్వహించారు. ఉదయం ఆమె మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, వైఎస్సార్‌సీపీ, టీడీపీ మాడుగుల అసెంబ్లీ అభ్యర్థులు ఈర్లె అనూరాధ, పైలా ప్రసాదరావు ఘన నివాళులర్పించారు. ఏడాదిన్నర క్రితం శ్రీనివాసరావు పెద్ద కుమారుడు, ఏడాది క్రితం తండ్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ బాధ నుంచి బయటపడక ముందే భార్య మృతి చెందడంతో అతడిని ఓదార్చడం ఎవరితరమూ కాలేదు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, దేవరాపల్లి జెడ్పీటీసీ కర్రి సత్యం, మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, నాలుగు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఇతర ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు సంతాపం తెలిపారు.

ధర్మశ్రీ ఎన్నికల ప్రచార రథం సిద్ధం



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

చోడవరం: వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచార రథం సిద్ధమైంది. త్వరలో ఎన్నికల నామినేషన్ల ఘట్టం ప్రారంభమవుతున్న తరుణంలో ఇప్పటికే ప్రచారం జోరుగా సాగుతోంది. వైఎస్సార్‌సీపీ చోడవరం అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తన ప్రచారంలో దూసుకుపోతున్నారు. తాజాగా తన ప్రచార రథాన్ని సిద్ధం చేశారు. వైఎస్సార్‌సీపీ జెండా రంగులతో పాటు మైక్‌లు, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ధర్మశ్రీ ఫొటోలతో ఈ ప్రచార రథాన్ని సర్వాంగ సుందరంగా తయారు చేశారు. ఈ రథాన్ని స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన జెండా ఊపి ప్రారంభించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు, జెడ్పీటీసీ మారిశెట్టి విజయశ్రీకాంత్, డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నర్సింగరావు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మొల్లి సోమునాయుడు, మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, పట్టణాధ్యక్షుడు దేవరపల్లి సత్య, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల రమేష్ పాల్గొన్నారు.

మంచి చేస్తున్న ప్రభుత్వానికి అండగా నిలవండి

- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు మద్దతుగా మాజీ జెడ్పీటీసీ ఈర్లె గంగునాయుడు ప్రచారం



కె.జె.పురంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ గంగునాయుడు

కె.కోటపాడు: పార్టీలతో సంబంధం లేకుండా ప్రజలకు మంచి చేస్తున్న సీఎం జగన్‌కు అన్ని వర్గాల వారు అండగా నిలవాలని మాజీ జెడ్పీటీసీ ఈర్లె గంగునాయుడు(నాని) కోరారు. సోమవారం కొరువాడ జగన్నాథపురంలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, ఈర్లె అనురాధలకు మద్దతుగా ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలను అందించడంతోపాటు గ్రామాల్లో చేసిన అభివృద్ధి గుర్తించి ఫ్యాన్ గుర్తుకు ఓటును వేయాలని ఉపాధి వేతనదారులను కోరారు. వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ యడ్ల దేముళ్లు, సచివాలయ కన్వీనర్ చీపురుపల్లి గోవింద, వై.అర్జున, జి.నారాయణమూర్తి, సన్యాసినాయుడు, జె.జగ్గారావు పాల్గొన్నారు.

ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: వేసవిలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని ఎంపీడీవో జాగరపు రాంబాబు తెలిపారు. స్థానిక ప్రధాన కూడలిలో చలివేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో ప్రధాన కూడళ్లలో ప్రయాణికులు నిరీక్షించే ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. మండలంలో తాగునీటి ఎద్దడి గ్రామాల్లో రూ.20 లక్షలతో బోర్లు వేశామన్నారు. వేసవిలో ఎక్కడా తాగునీటి సమస్యపై ఫిర్యాదులు రాకుండా ఎన్నికల కోడ్‌కు ముందే బోర్లు వేశామన్నారు. ఇంటింటా కుళాయి పనులు సైతం వేగవంతంగా పూర్తి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పంచాయతీ విస్తరణాధికారి మూర్తి, పంచాయతీ కార్యదర్శి శ్రీను సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే గణేష్ పరామర్శ



బాధిత కుటుంబం నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

గొలుగొండ: తాండవ జలాశయంలో ఆదివారం అర్ధరాత్రి రొయ్యల వేటకు వెళ్లి బోటు ప్రమాదానికి గురై గల్లంతైన జాలరి కుటుంబాన్ని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సోమవారం పరామర్శించారు. పాగచెట్లపాలెం గ్రామానికి చెందిన గరగల అప్పారావు బోటులో నీరు అధికంగా చేరడంతో అది మునిగిపోయింది. ఆ సమయంలో సమీపంలో రొయ్యల వేట సాగిస్తున్న జాలర్లు రక్షించే ప్రయత్నం చేసినా అప్పారావు నీట మునిగిపోయాడు. ఈ నేపథ్యంలో అతని కుటుంబాన్ని ఎమ్మెల్యే గణేష్‌తోపాటు జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ జక్కు నాగమణి, తాండవ జాలర్ల సంఘం అధ్యక్షుడు నక్కా రమణ పరామర్శించారు.

పోలింగ్ బూత్‌ల్లో ఆర్వో పరిశీలన



కొత్తకోట హైస్కూల్ బూత్‌లో సౌకర్యాలపై ఆరా తీస్తున్న ఆర్వో చిన్నికృష్ణ



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న నాతవరం తహసీల్దార్ రమేష్‌కుమార్

రావికమతం: కొత్తకోట హైస్కూల్‌లోని నాలుగు పోలింగ్ బూత్‌లను చోడవరం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిన్నికృష్ణ సోమవారం తనిఖీ చేశారు. ఇక్కడ విద్యుత్, ర్యాంప్, మంచినీరు, టాయిలెట్ వంటి సౌకర్యాలన్నీ పరిశీలించారు. తాగునీరు, టాయిలెట్ల వద్ద పేర్లు రాయాలని సిబ్బందికి సూచించారు. ఎన్నికల ప్రచారం సభలకు, సమావేశాలకు పూర్తి వివరాలతో ముందుగా సువిధ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుమతులు లేకుంటే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రమణారావు ఉన్నారు.

నాతవరం: మండలంలో 65 పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తహసీల్దార్ ఎస్.రమేష్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన చమ్మచింత, మాధవనగరం, సరుగుడు, గుమ్మడిగొండ, నాతవరం పంచాయతీలో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంటు డి.కృష్ణ సిబ్బంది ఉన్నారు. అదేవిధంగా ఎంపీడీవో జాగరపు రాంబాబు డి.యర్రవరం, జిల్లేడుపూడి, చెర్లోపాలెం పంచాయతీల్లో పర్యటించారు. వలంటీర్ల దగ్గర్నుంచి సామగ్రిని స్వాధీనం చేసుకునే బాధ్యత పంచాయతీ కార్యదర్శులదే అన్నారు. పింఛన్ల పంపిణీ, చలివేంద్రాల ఏర్పాటుపై చర్చించారు. పంచాయతీ విస్తరణాధికారి మూర్తి పాల్గొన్నారు.

మద్యం విక్రేతలపై కేసు

బుచ్చెయ్యపేట: వడ్డాదిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి. ఈశ్వరరావు సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన ఒకరి వద్ద 15 మద్యం సీసాలు, మరొకరి వద్ద 9 లీటర్ల సారాతో పట్టుకున్నామన్నారు. వీరిలో సారా అమ్ముతున్న వ్యక్తిని రిమాండ్‌కు తరలించామన్నారు.

బూడి, అనురాధలకు సంపూర్ణ మద్దతు



ఎంపీ అభ్యర్థి బూడిని కలిసి దుశ్శాలువాతో సన్మానిస్తున్న శంకరరావు, తాతయ్యబాబు

దేవరాపల్లి: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ నిబద్ధతో సేవలందించే వైఎస్సార్‌సీపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, మాడుగుల అసెంబ్లీ అభ్యర్థి ఈర్లె అనురాధకే పలు సామాజిక వర్గాల ప్రజలు, నాయకులు మద్దతు పలుకుతున్నారు. సోమవారం తారువలో వారిని స్వచ్ఛందంగా కలిసి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. రోలుగుంట మండల సీనియర్ నాయకుడు గొర్లె సూరిబాబు, మాజీ ఎంపీపీ శెట్టి సత్యనారాయణ మూర్తి, కుసర్లపూడి సర్పంచ్ ముద్దు అప్పలనాయుడు, కొవ్వూరు సర్పంచ్ మలసాల భాస్కరరావు, మాడుగుల మండలం సాగరం పంచాయతీకి చెందిన సీనియర్ నాయకుడు కోట్ని సన్యాశినాయుడు, గింజాన దేముళ్లు సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

కె.కోటపాడు: వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడుకు పాడుగుపాలెం గ్రామ కన్వీనర్ లెక్కల శంకరరావు, రైవాడ ప్రాజెక్టు మాజీ చైర్మన్ బొడ్డు తాతయ్యబాబు కలిసి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. మంచి మెజార్టీతో గెలుపొందాలని ఆకాంక్షించారు.

ఘనంగా మరిడిమాంబ విగ్రహ ప్రతిష్ట

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి, అనురాధ పూజలు



మారేపల్లిలో మరిడిమాంబను దర్శించుకుంటున్న అసెంబ్లీ అభ్యర్థి ఈర్లె అనురాధ

దేవరాపల్లి: మారేపల్లిలో మరిడిమాంబ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, మాడుగుల అసెంబ్లీ అభ్యర్థి ఈర్లె అనురాధ పాల్గొని పూజలు చేశారు. వీరిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మహిళలు, చిన్నారుల కోలాట ప్రదర్శనను తిలకించారు. అనురాధ కొద్ది సేపు కోలాటమాడి మహిళలను ఉత్తేజ పరిచారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.